క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భద్రావతి భావనారుషి దేవాలయ మండపంలో భద్రావతి భావనారుషి కల్యాణాన్ని పురస్కరించుకొని మూడవ రోజు హోమాలు నిర్వహించారు. భద్రావతి భావనారుషి హోమం, రుద్ర, నవగ్రహ, గణపతి, సుదర్శన హోమాలు చేపట్టి పూర్ణాహుతి గావించారు. అనంతరం సామూహిక విష్ణుసహస్ర నామ, పుష్పార్చన కార్యక్రమం జరిపించారు.సాయంత్రం మహాసరస్వతి, మహాలక్ష్మి, శ్రీలలితా సహస్ర నామసహిత శ్రీదేవి ఖడ్గమాల, సామూహిక కుంకుమార్చన చేపట్టి మహా మంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గాజుల వేణు మాట్లాడుతూ మంగళవారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాబ్ మేళాలో 30 మంది ఎంపిక



అర్హత సాధించిన అభ్యర్థులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ కస్టమర్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం జరిగింది. ఈ జాబ్ మేళాకు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్ రెడ్డి, డీఎస్‌డీఓ, ఏపీఎస్‌ఎస్‌డీసీ, కియా ఇండియా కంపెనీ మేనేజర్ రాములు పాల్గొన్నారు. 119 మంది అభ్యర్థులు పాల్గొనగా 30 మంది అర్హత సాధించినట్లు వారు తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

9న జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీలు

నంద్యాల(అర్బన్): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గోవిందరెడ్డి, చిత్రకారులు కంబగిరిరాజు జ్ఞాపకార్థం ఈనెల 9వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో పదవ జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిత్రకారులు రాంప్రసాద్, చింతలపల్లె కోటేష్ సోమవారం తెలిపారు. పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, ప్రథమ బహుమతి కింద రెండు గ్రాముల బంగారు పతకం, ద్వితీయ బహుమతి 20గ్రాముల వెండి పతకం, తృతీయ బహుమతి 10గ్రాముల వెండి పతకాలతో పాటు పది మందికి స్పెషల్ జ్యూరీ బహుమతులు అందజేస్తామని చెప్పారు.వివరాలకు సెల్ : 9866760490 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

7న ‘పది’ మోడల్ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు పదోతరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్షను నిర్వహిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎంఆర్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు రాజా తెలిపారు.సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి మనోధైర్యాన్ని నింపేందుకే ప్రముఖ విద్యావేత్త కృష్ణ, గుంటూరు, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ లక్ష్మణరావు పర్యవేక్షణలో ప్రశ్నపత్రం రూపొందించామని చెప్పారు. పదవ తరగతి సిలబస్ నుంచి వంద మార్కులకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని విద్యార్థులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 8500303143 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కిశోర్, సందీప్, హర్ష, సైఫుల్లా పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ

చాగలమర్రి: స్థానిక అజీం బ్రిల్లియంట్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కడప పట్టణంలోని ఆయేషా బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి అబాకస్ పోటీల్లో సత్తా చాటారు. హెచ్ఎం గౌసులాజం మాట్లాడుతూ 3వ తరగతి విద్యార్థి అర్షద్ జూనియర్ లెవెల్-1 కేటగిరిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడని చెప్పారు.

ఆల్బెండజోల్ మాత్రలను మింగించండి

నంద్యాల: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా నులిపురుగుల నివారణ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులందరితో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలన్నారు. అనంతరం గోడపత్రికలను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ వెంకటరమణ, జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్‌తో కలిసి విడుదల చేశారు.

ఘనంగా వసంత పంచమి



సరస్వతి దేవి అలంకారంలో గాయత్రి దేవి



ఆళ్లగడ్డలో ఆవోపా ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం



అక్షరాభ్యాసం చేయిస్తున్న దస్తగిరిరెడ్డి



అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్)/(వ్యవసాయం): పట్టణంలోని బాలచంద్రా సమతా విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ బాలచంద్రుడు, జయలక్ష్మి అధ్యక్షతన వసంత పంచమి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పిల్లలతో విద్యాభ్యాసం చేయించారు. అలాగే గురురాజా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి, కరస్పాండెంట్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి పాల్గొని వంద మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మాస్టర్ పబ్లిక్ స్కూల్‌లో దస్తగిరి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

➡ సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవ సమాజ్ ఆధ్వర్యంలో 108 కలశాలతో సరస్వతీ దేవి విగ్రహానికి అష్టోత్తర క్షీరాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి సామూహిక ఉచిత కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు.

➡ శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పంచమిని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి పట్టువస్త్రాలతో అలంకరింపజేసి మహామంగళ హారతులు ఇచ్చి..భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

➡ ప్రథమనందిలోని గాయత్రీ ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో సరస్వతి హోమం జరిపించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు 800 మందికి టీటీడీ కంకణాలు, పెన్నులు, ప్రసాద వితరణ గావించారు. మురళీకృష్ణారావు, రవీంద్రనాథ్, కేశవమూర్తి, సాయినాథ్ పాల్గొన్నారు.

చదువుల తల్లికి పూజలు

ఉయ్యాలవాడ : మాఘ శుద్ధ పంచమి చదువుల తల్లి సరస్వతీ దేవి పుట్టిన రోజును పురస్కరించుకుని మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి, పుష్పార్చన, అభిషేకాలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆళ్లగడ్డ: వసంత పంచమి వేడుకలు సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు, ప్రభుత్వ విద్యాలయాల్లో సరస్వతి పూజలు నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.



మాయలూరులో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

అధికారులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమాన్

గోస్పాడు: అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించాలే తప్ప వర్గాలను చూసి కాదని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్, జెడ్పీటీసీ జగదీశ్వరమ్మ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతుంగా.. ఎం.కృష్ణాపురం సర్పంచ్ కోటిరెడ్డి అమృత్ స్కీమ్ కింద వచ్చే నీటి సరఫరా గత నాలుగు రోజులుగా గ్రామానికి అందడం లేదని, అసలే ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని ప్రస్తావించారు. అలాగే సాంబవరం సర్పంచ్ ఐజయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఇప్పటికే పని చేస్తున్న మేటీలను కొనసాగించాలని, గ్రామంలో ప్రస్తుతం ఉన్న మేటీలను తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటారనే ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారి నుంచి ఇబ్బందులు లేకుండా అధికారులు చూసి ఉపాధి పనులను సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. వెలుగు కార్యాలయంలో సిబ్బంది తీరు మార్చుకోవాలని ఎంపీపీ, ఉప మండలాధ్యక్షుడు సూచించారు. హాజరు కాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయాలని ఎంపీపీ ఎంపీడీఓకు సూచించారు. ఒక వైపు పూర్తిస్థాయిలో అధికారులు రాకపోగా మరోవైపు సమావేశానికి వచ్చిన అధికారులు సభ పూర్తవకుండానే మధ్యలోనే వెళ్లిపోతుండటంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప మండలాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, ఈఓపీఆర్‌డీ నాగఅనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో ప్రతిధ్వనించిన నారసింహ నామం



అమ్మవారిశాలలో కొలువైన ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి పార్వేట ఉత్సవ పల్లకీ ఆళ్లగడ్డలో కొలువుదీరింది. ఉత్సవ మూర్తులు శ్రీ జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరదస్వాములను సోమవారం పట్టణ వాసులు బారులుదీరి దర్శించుకున్నారు. పలు తెలుపులపై కొలువుదీరిన ఉత్సవ పల్లకీకి ప్రజలు విశేష పూజలు చేశారు. అనంతరం ఒక తెలుపు నుంచి మరో తెలుపుపైకి భుజాలపై మోసుకుంటూ నడిచారు. ఈ సందర్భంగా నరసింహ స్వామి నామస్మరణ మారుమోగింది. స్వామి రాకతో పట్టణంలోని ఇళ్లు బంధుగుణంతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవ పల్లకీ అమ్మవారిశాలలో కొలువుదీరగా.. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు ఉత్సవమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు

పీజీఆర్ఎస్‌లోనూ నిర్లక్ష్యమేనా?

గోస్పాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొనే అధికారులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. ప్రతి సోమవారం ప్రభుత్వం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు మండల కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే మండల కేంద్రాల్లో జరిగే పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కావడం లేదు. ఇంకొందరు వచ్చినా సెల్‌ఫోన్‌లలో మునిగిపోతున్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉన్నా అదే రోజు మండల సర్వసభ్య సమావేశం కూడా నిర్వహించడంతో అధికారులు అటూఇటూ తిరగాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో కో ఆపరేటివ్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ వచ్చినప్పటి నుంచి సెల్‌ఫోన్‌లోనే నిమగ్నమయ్యారు. ఈ విషయంపై పలువురు విలేకరులు ప్రశ్నించగా.. తనకు ఇక్కడి విధులతో సంబంధం లేదని తెలిపారు. ఉన్నతాధికారులు చెబితే ఇక్కడికి వచ్చానని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.



పీజీఆర్ఎస్‌లో సెల్‌ఫోన్ చూస్తున్న అధికారి

మంచినీరు అందించరూ!



తాగునీరు లేక అవస్థలు పడుతున్న ప్రజలు

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ సక్రమంగా అందక రోగులు, వారికోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సహకారంతో ఆసుపత్రి ఆవరణలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సిబ్బంది కొందరు తాగునీటి సరఫరాను నిలిపివేస్తుండటంతో సమస్య తలెత్తుతోంది. అందులో భాగంగానే సోమవారం రాత్రి భోజనం చేసే సమయంలో నీటి కోసం వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లగా అక్కడ ఉన్న కుళాయిలకు నీటి సరఫరా లేకపోవడంతో వెనుతిరగాల్సి వచ్చింది. దీంతో రోగుల బంధువులు బాటిళ్లతో ఆస్పత్రి బయట ఉన్న హోటళ్ల వద్దకు క్యూ కట్టారు. ఉచితంగా వచ్చే నీరు అందక పోవడంతో బయట లీటరు రూ.5 చొప్పున కొనుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజన సమయంలో చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు కూడా సక్రమంగా నీరందడం లేదని వాపోయారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చాగలమర్రి: మండలంలోని చిన్నబోధనం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన అన్నవరం నరసింహుడు అదే గ్రామానికి చెందిన పాపిరెడ్డి కొట్టాడని మనస్తాపంతో సోమవారం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యులు నంద్యాలకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

ఫ్యామిలీ పింఛన్ల పరిశీలన

శిరివెళ్ల: మండలంలో సోమవారం ఫ్యామిలీ పింఛన్ల పరిశీలన జరిగింది. అనంతపురానికి చెందిన ప్రత్యేక వైద్యులు మోహన్ నాయక్, రాజశేఖర స్వరూప్, హుస్సేన్ గుంప్రమాన్‌దిన్నె గ్రామ సచివాలయ పరిధిలోని గుంప్రమాన్‌దిన్నె, రాజనగరంలోని ఐదుగురు, యర్రగుంట్ల సచివాలయాల పరిధిలోని 10 మంది, కోటపాడు, వీరారెడ్డిపల్లెలో 5, శిరివెళ్ల 4 గ్రామ సచివాలయ పరిధిలోని 9 మంది పింఛన్‌దారుల శారీరక స్థితిగతులు, ధ్రువ పత్రాలను పరిశీలించారు. రూ.15 వేల పింఛన్లకు వారు అర్హులా కాదా అని పరిశీలించారు. ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా.. మంగళవారం గోవిందపల్లె, చెన్నూరు, మహదేవపురం, గుండంపాడులలో పరిశీలన జరగనుందని అధికార వర్గాలు తెలిపాయి.



గుంప్రమాన్‌దిన్నెలో పింఛన్‌దారును పరిశీలిస్తున్న డాక్టర్లు

మహిళ ఆత్మహత్య

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఓబులమ్మ (55) కడుపునొప్పి తాళలేక క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి క్రిమి సంహారక మందు సేవించి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఆసుపత్రికి చెరుకొని కుటుంబ సభ్యుల వివరాల మేరకు కేసు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

విజయవంతం చేయండి

చాగలమర్రి: ఈ నెల 7వ తేదీన హైదరాబాదులోని ఎల్‌బీ స్టేడియంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్షల డప్పులు-వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ సోమవారం పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలో కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. తాలూకా ప్రధాన కార్యదర్శి ఘన మద్దిలేటి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం ప్రిన్సిపాల్ కరీముల్లా అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి సునీత, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో 21మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇమాంల సంఘం అధ్యక్షుడు అంజాద్‌సిద్దిఖీ, ఫిరోజ్, హెబ్‌నైజర్ వేణు, నాగేశ్వరరావు, రవి, గోవిందనాయుడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

దొర్నిపాడు: అవసర నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దారు సుభద్ర సూచించారు.సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని మాట్లాడుతూ భూసమస్యలు, విద్యార్థులకు కావాల్సిన ధ్రువ పత్రాలు పాస్ పుస్తకాల జారీలో వేగంగా స్పందించి పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో డీటీ మాధవ్ ఉన్నారు.

నిత్యావసర కిట్ల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెయింట్ యాన్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో 70 మంది బాలలకు నిత్యావసర కిట్లను సోమవారం పంపిణీ చేశారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సభ్యులు మేడా చంద్రశేఖర్ సహకారంతో రెండు కాళ్లు పని చేయని దివ్యాంగుడికి చక్రాల కుర్చీని అందజేశామన్నారు. అదే విధంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ హరినాథరెడ్డి, విజయభాస్కరరెడ్డి, అనిల్‌కుమార్ సహకారంతో మందులు, నిత్యావసర కిట్లను అందజేశామని చెప్పారు. లయన్స్‌క్లబ్ సభ్యులు నిజాముద్దీన్, రమేష్, నాగరాజు, సిస్టర్ రీనాజోష్, జోసెఫ్ రాణి, స్వప్న పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



దేవాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

గోస్పాడు: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ విశాలాక్షి సమేత ఓంకారేశ్వరస్వామి విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని సోమవారం వైభవంగా ప్రతిష్ఠించారు. శ్రీ కమలానంద భారతి స్వాముల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మూడవ రోజు ప్రత్యేక పూజలు జరిపించారు. పూజల్లో రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మంత్రి ఫరూక్

బీసీ భవన్ ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రంలో బీసీలకు భవనాన్ని ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రయాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2018 జీవో ప్రకారం ప్రతి జిల్లాలో 50 సెంట్ల స్థలంలో బీసీ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అప్పట్లో నిధుల కేటాయించారని గుర్తు చేశారు. బీసీలు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజకుమారితో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

నాణ్యమైన మేతతో అధిక పాల ఉత్పత్తి



పొలాల్లో మేత మేస్తున్న బర్రెలు

గోస్పాడు: మేతతో పాడి పశువుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పాడి పశువుల్లో విటమిన్-ఎ, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి పోషక పదార్థాల లోపం వల్ల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. చాలా మంది రైతులు వర్షాకాలం, చలి కాలంలో పచ్చిమేతలు, ఎండాకాలంలో ఎండు గడ్డిని దాణాగా అందిస్తారు. ఇది సరైన పద్ధతి కాదని పచ్చిమేత ఎక్కువగా దొరికే వర్షాకాలంలో పాతర వేసి నిల్వ చేసుకోవాలని సూచిస్తున్నారు. అన్ని కాలాల్లో పచ్చిమేత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. మండలంలో తెల్ల జాతి పశువులు 1321, నల్లజాతి పశువులు 7,354 ఉన్నట్లు పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు.

సరైన మోతాదులో మేత ఇవ్వాలి..

రోజూ ఒక్కో పశువుకు 8 కిలోల వరి గడ్డి, లేదా ఎండు చొప్ప, 8 కిలోల లెగ్యూమ్ జాతి పచ్చిమేత (పిల్లి పెసర, అలసంద, గోరుచిక్కుడు), 16 కిలోల గింజ జాతి పచ్చి మేతలు ఇస్తే అన్ని రకాల పోషకాలు అందుతాయి. రైతులు పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. పుష్టికరమైన మేత, పరిశుభ్రమైన నీటిని అందించాలి. దీనివల్ల సకాలంలో ఎదకు వస్తాయి. అలాగే.. పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుంది.

రైతులు పశుగ్రాస వనరులను సమకూర్చుకోవాలి



పాడి పశువుల పోషణకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. పశుపోషకులు ఉన్న వనరులతో పశుగ్రాసాలను సమకూర్చుకోవాలి. ధాన్యాలతోనే చవకగా దాణా తయారు చేసుకొని పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలి. పచ్చిగడ్డి ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పశువుల ఆరోగ్యసంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు పాటిస్తే రైతుకు లాభసాటిగా ఉంటుంది.

– అభిలాష్‌రెడ్డి, పశువైద్యాధికారి, యాళ్లూరు